# అంతర్మథనం

## ఎస్. రేవతి



**నాకీ రోజు సన్మానం. ఆదర్శ ఉపాధ్యాయుడిగా నలభై ఏళ్లు సేవలందించినందుకుగాను నాకు సన్మానం జరగబోతోంది. నా రిటైర్మెంట్ సందర్భంగా నా దగ్గర చదువుకుని పైకి వచ్చిన మా జిల్లాలోని ప్రముఖులంతా ఈ సన్మానానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.**

**మన చేతికి లేలేత మొక్కలుగా వచ్చే పిల్లలకి మంచీచెడూ చెప్పి, విలువలు నేర్పి పౌరులుగా పంపటం, వాళ్లు పైకి వస్తే చూసి సంతోషించటంలో ఉన్న తృప్తి ఇంకే వృత్తిలోనూ దొరకదేమో. ఆ తృప్తి గుండెల నిండా ఉంది నాకు.**

**నా శ్రీమతి జానకిని కూడా 'అమ్మగారూ' అంటూ మా ఊరి వాళ్లంతా గౌరవిస్తారు. నా వెంట నా ఛాయలా ఉంటూ నా అవసరాలు అడగకుండానే తీర్చే నా భార్యకి నా విద్యార్థులంతా పిల్లలే.**

సాయంత్రం ఆరు గంటలకి సభ. నేను ఐదున్నరకి అక్కడికి చేరితే చాలు. భోజనం చేసి వక్క పలుకు నోట్లో వేసుకుని పడక కుర్చీలో నడుం వాల్చాను. జానకి ప్రక్క వారింటి చంటాడిని తెచ్చుకుని ఆడిస్తూంది కాబోలు 'అత్త, అవ్వ' అంటూ ఏవో మాటలు వల్లిస్తోంది. మా అమ్మాయి జనని పక్క ఊరి గవర్నమెంట్ హాస్పటల్లో ఉద్యోగం చేస్తోంది.

తృప్తి ఉన్నవారికి జీవితం ఎంతో హాయిగా ఉంటుంది. నేను సంపాదించుకున్న ఆస్తి ఈ పెంకుటిల్లేనని నా భార్య అప్పుడప్పుడు నిట్టూరుస్తూ ఉంటుంది. కానీ నాకంటూ ఇంకే కోరికలు లేవు. తృప్తి – దాన్ని మించిన ఆస్తి లేదు.

ఆనందం, తృప్తి నిండిన ఈ జీవితంలో నాలో – నాలోని నాలో – నా అంతరాంతరాలలో ఉన్న చీకటి కోణంలోకి ఏ మాత్రం గాలి, వెలుతురూ చొరబడనీయకుండా జాగ్రత్త పడుతూ రోజులు వెళ్లమారుస్తున్నాను. నా భార్యకి కూడా తెలియనివ్వకుండా నాలోనే సమాధి చేసుకున్న నిజం నిప్పులా నా మనసుని కాలుస్తూనే ఉంది. అందుకే ఆ చీకటిలోకి ఏ మాత్రం వెలుగు ప్రసరించకుండా నా నుంచీ నేనే పారిపోతూ ఉంటాను.

నా మనసులో ఉన్న అపరాధ భావాన్ని కప్పిపుచ్చటానికి గాంభీర్యం అనే ముసుగు వేసుకొని పగలంతా గడిపేస్తాను. కానీ రాత్రి అతి భయంకరమైనది. అది నన్ను నాకేరాక్షసుడిలా చూపెడుతుంది. మనసుని కర్కశంగా రంపపుకోత కోస్తుంది. ఆ చీకటిలో జానకి ఎదుట నా మనసు మోకరిల్లుతుంది. ఆమె ఇంతింతై వటుడింతై అన్నట్లు ఎంతో ఎత్తుగా ఎదిగి పోతుంది. ఆమె పాదాలపైబడి క్షమించమని పసి వాడిలా నేను అలమటిస్తూ ఉంటాను. ఆ ఆవేదన అనంతం, వర్ణనాతీతం.

నిన్నటివరకూ పగలంతా స్కూలు. సాయంత్రం ఐదుగంటల నుండీ ఎనిమిదిన్నర దాకా ప్రైవేటుతో గడిచిపోయింది. ఇక నుండీ తీరిక. నాలోని రాక్షసుడు నన్ను పగలు కూడా హింసిస్తాడు. సాయంత్రం పిల్లలతో కాలక్షేపం. కానీ పగలు, రాత్రి నాకింక శత్రువులే. నన్ను నేను నిందించుకుంటూ జీవించాలి. లాభం లేదు. ఇలా ఎన్నాళ్ళు? నా నుంచీ నేను ఎన్నాళ్లని పారిపోగలను? పదిహేనేళ్ల గడిచాయి. నా మనసులోని ఆ చీకటి కోణంలోకి టార్చిలైట్ వెలుతురులాంటి నా ఆలోచనలని మెల్లి మెల్లిగా ప్రసరింపచేస్తూ నా వికృత రూపాన్ని నేనే చూసి జడుసుకోకుండా మనసుని చిక్కబట్టుకున్నాను.

****

నా మొదటి సంతానం సారథి. రెండేళ్ల వాడు అయ్యేవరకూ మేం గుర్తించ లేదు. వాడి మెదడు ఎదగటం లేదని, చెపితే విని చెప్పింది చేస్తాడు. కానీ తనంతట తను కంచంలో పెట్టింది కూడా తినడు. కోపం ఎక్కువ. వాణ్ణి బుజ్జగించి, బ్రతిమాలి స్నానం, భోజనం చేయించాలి. చదువు అబ్బే అవకాశం అసలే లేదు. ఏడేళ్ల తరువాత జనని పుట్టింది. చురుకైన పిల్ల. నెలల పిల్లగా ఉండగానే గిలకలా ఇల్లంతా పాకుతూ చలాకీగా తిరుగుతూ ఉంటే ఎనిమిదేళ్ల సారథి ఏపుగా ఉండికూడా స్తబ్దుగా కదల కుండా కూర్చుని కళ్లు పెట్టుకు చూసేవాడు. ఏదో అలౌకికమైన ఆనందం పొందుతున్నట్టు ఎంతో ప్రశాంతంగా ఉండేది వాడి ముఖం. కానీ అంత లోనే ఏదో కోపంతో చేతిలోది గిరాటు వేసే వాడు. నేనో జానకో వాణ్ణి దగ్గరికి తీసుకుని బుజ్జగించి 'వొద్దమ్మా' అంటే ఎంతో హాయిగా నవ్వే వాడు. పదేళ్ల వయసులో కూడా ఏడాది పిల్లాడికి చెప్పినట్టే చెప్పాలి. జానకి తన శాంతాన్నీ, ప్రేమనీ, శ్రద్ధనీ, తెలివితేటల్నీ అన్నింటినీ రంగరించి వాడిని కంటికి రెప్పగా చూసింది. నడవమనీ పరిగెట్టమని కూడా చెబితేనే చేసేవాడు.

పదేళ్ల వయసులో వాకిట్లో పిల్లల ఆటలు చూస్తూ కూర్చున్న సారథి ఎప్పుడు లేచి వెళ్లిపోయాడో ఎవరూ చూడలేదు. పొద్దుగూకిన తరువాత అంతా వెతికాము. వాడి జాడ తెలియనేలేదు. ఊరంతా వాకబుచేస్తే ఎక్కడా తెలియలేదు. ఆ క్రితం రోజు రాత్రంతా నాటక పోటీలని ఏవేవో ఊళ్ల నించీ కళాకారులంతా వచ్చి మా స్కూలు ఆవరణలో నాటకాలు వేసారు. ఆరోజు పగలు విశ్రాంతి తీసుకుని సాయంత్రం బహుమతి ప్రదానం అయ్యాక ఎక్కడి వారక్కడ వెళ్లిపోయారట. వారిలో ఎవరి కారులోనే వ్యాను లోనే ఎక్కాడేమోనని ఎవరో అంటుంటే నా గుండె గుభిల్లుమంది. ఆంధ్ర రాష్ట్రం నలుమూలల నుంచీ ఎంతోమంది వచ్చారు. ఎక్కడని వెతకటం? మాతో చెబితే బాధపడతామని చెప్పకుండా బావులు, చెరువూ కూడా వెతికారట మా శిష్యులు. పేపరు ప్రకటనలు అవీ కూడా పని చెయ్యలేదు.

మరో రెండ్రోజులు ఏదో చిరుఆశతో ఎలాగో గుండెలు చిక్కబట్టుకున్నాము. ఇంక వెతికి లాభం లేదని అర్థం అవగానే నాకు ఎక్కడ లేని నిరాశ, నిస్పృహ కలిగి ఒక రాత్రివేళ మా పెంకుటింటి దూలానికి పంచెను కట్టి, ఆ కడుపుకోత నుండీ శాశ్వతంగా విముక్తుణ్ణి అయ్యే ప్రయత్నంలో ఉండగా ఎందుకో మాగన్నుగా నిద్రపోతున్న జానకి నన్ను చూసి కెవ్వు మంది. నా కాళ్లకి చుట్టుకుని భోరున ఏడుస్తూ 'వాడు తిరిగి వస్తే చూసుకోవడానికి మనం ఉండాలి. పిల్లల్ని కనేవరకే మన జీవితం మనది. ఆ తరువాత వాళ్లకోసమే మనం బ్రతకాలండీ. వాళ్లకోసం ఏం చేసినా చెయ్యకపోయినా మనం బ్రతికుండటం ఎంతో ముఖ్యం. ఇలాంటి పని ఇంకెప్పుడూ చెయ్యవద్ద'ని ప్రమాణం

చేయించుకుంది.

క్రమంగా మా ఇద్దరికీ పాపతోనే ఋణ బంధం ఉండేమోనని సరిపెట్టు కున్నాం. అప్పటికి జనని మూడేళ్ల పిల్ల అవటంతో దానికి మా ఆలన, పాలన అవసరం కాబట్టి దాని చిలిపితనం, చురుకుతనంతో మా జీవితాల్లో చైతన్యం నిలిచింది. కాలం మారుతూ ఎండా, వాన, చలి లాంటి మార్పులొచ్చినప్పుడల్లా సారథిని తలచుకొని కుమిలిపోయేవాళ్లం. ఈ ఎండల్లో ఎక్కడ ఉన్నాడో, ఈ వానలో తడుస్తున్నాడేమో అనుకుంటూ ఉండేవాళ్లం. ఈ విషాదం తాలూకు నీలినీడలు జనని బాల్యం పై పడకుండా తన ఆనందాలకి లోటు రాకుండా పెంచాలని జానకి ఎంతో తాపత్రయ పడేది. కానీ తెల్లవారుఝామున లేచి కూర్చుని ఎంతో దుఃఖించేది.

సారథి వెళ్లిపోయిన తరువాత మూడు నాలుగేళ్లు మేం ఆర్థికంగా ఎంతో ఇబ్బంది పడ్డాం. గవర్నమెంటు టీచర్లకి నెలల తరబడి జీతాలు ఇచ్చేవారు కారు. బతకలేక బడిపంతులు అన్నది అక్షరాలా నిజం అనిపించేది. నెల గడవటానికి అప్పులు చేస్తే జీతాలు వచ్చేనాటికి వడ్డీ పెరిగిపోయేది. ఉండేది టౌనే కాబట్టి, కాస్త బడి పంతులంటే అంతో ఇంతో జనానికి గౌరవం కాబట్టి ఎలాగో కూరకీ నారకీ వెళ్లమారేది.

అలాంటి సమయంలో చెల్లెలి భర్త పోయాడని వార్త రావటంతో జ్వరంగా ఉన్న జనని దగ్గర జానకిని ఉంచి నేను ఒక్కడినే అర్జంటుగా బయలుదేరి వెళ్లాను. అన్నీ అయి తిరుగుముఖం పట్టేసరికి సరిగ్గా బస్సు ఛార్జీలకు మాత్రం డబ్బులున్నాయి. ఇలాంటి సందర్భాలలో ఏ ఖర్చూ కాదనుకునేది కాదు మరి. బస్సు బదులు ఏ లారీయో పట్టుకుంటే కాస్త తక్కువలో వెళ్లొచ్చని బస్ షెల్టర్ పక్కన ఇసు కదిబ్బ మీద కూర్చున్నాను. పదకొండో రోజు కార్యక్రమాలకి డబ్బు చూడమని చెప్పింది చెల్లెలు. ఏ దారీ కనిపించలేదు. సాయంత్రం నాలుగవుతోంది. పక్కన పెద్దమేడ ఏదో కడుతున్నారు. కొత్తగా కట్టిన రూఫ్‌మీద నీళ్లు నింపినట్టు ఉన్నారు. అవతలి నుంచి వీచేగాలి ఆ మేడని దాటేసరికి చల్లగా మారుతోంది.

''ఇగో బిడ్డ. అట్ల నిలబడకు. నెత్తిమీద తట్టల ఉన్న ఉసికె ఆడ పోసిరా. మల్ల రావాలె. చప్పున'' అంటోంది ఒక కూలి మనిషి.

''ఇగొ. మల్ల గంపల ఉసికె నింపుకపో''

''ఇగరా. ఇంత తిని కూసుందువు జెరసేపు''

''కాల్లు కడుగు. చేతులు మంచిగరుద్ది కడుగు. అగ . తుడుసుకో నాయినా!'' అంటూ వినిపిస్తున్నాయి మాటలు.


ఎండలో బస్టాండ్ దాకా వచ్చి, నీడలో కూర్చుంటే చల్లగాలికి కునుకు తీస్తున్నా.

''ఏందిరయ్యో! అట్ల పోస్తివో. అన్నం నేల పాల్జేస్తివి. ఏంది బిడ్డా. ఏం గావాలె? ఈ ఇంత అన్నం తిను. నీకు అప్పటికి ఏమన్న ఇప్పిస్త. ఇగో, నోరు తెర్వు. నేనే తినిపిస్త – బిడ్డా. పని చెయ్యాలె. తినాలె. మా నాయనా మా నాయిన...''

కాస్త హెచ్చుస్థాయిలో ఆవిడ అనే మాటలకి మెలకువ వచ్చింది. అందరూ కూలీలూ అటువైపున ఎక్కడో కూర్చున్నారు. ఈ తల్లీ కొడుకు ఇక్కడ ఇవతలగా కూర్చుని తింటున్నారు.


సర్దుకు కూర్చుందామని ఇటు తిరిగి వాళ్లకేసి చూస్తూ కూర్చున్నాను. అప్పటివరకూ చిన్నపిల్లాడనుకున్నాను. కానీ వాడికో పది హేనేళ్లుంటాయి. ఇంకా చిన్న పిల్లాడికిలాగా ఆవిడ అలా ఎందుకు చెబుతోంది? నాకేదో అనుమానం వచ్చి ఇంకా శ్రద్ధగా గమనించాను. ఆ అబ్బాయిలో ఏదో లోపం. అదే అచ్చం సారథిలానే... సారథేనా...? అబ్బే. వాడిలా ఎందుకుంటాడు? తెల్లగా బొద్దుగా దొరబాబులాగా ఉండే వాడు. అసలు పోలికే లేదు. అనుకుంటూ ఎవరో తరుముతున్నట్టు గబగబా నడిచి ఎదురుగా ఉన్న బస్‌లోకి ఎక్కేసాను. 'సారథికాదు. అది సారథి కానే కాడు' అని నాకు నేనే పదిసార్లు చెప్పుకున్నాను. కానీ వాడి వీపు మీద చినుకు ఆకారంలో ఉన్న పుట్టుమచ్చ వాడు సారథేనని చెపుతూ చురకత్తిలా మారి నా గుండెని తూట్లు తూట్లు పొడిచింది. 'వాడు సారథి కాదు కాదని నా మనసు కళ్లకి గంతలు కట్టుకొని అరుస్తూ చివరికి అంతరాత్మ చేతిలో ఓడి మూగబోయింది.

ఒకటి... రెండు... మూడురోజులు గడిచాయి. ఈ రంపపు కోత భరించలేనని అర్థం కాసాగింది. ఇంక లాభం లేదని, సారథిని తెచ్చేసు కోవాలని గట్టిగా నిశ్చయించుకున్నాక కాస్త ప్రాణం కుదుటపడింది. నాలుగో రోజు అక్కడికే వెళ్లాను. అక్కడెవరూ కనిపించలేదు. నా గుండె వేగం పెరిగింది. ఏమై ఉంటుందో ఊహించలేకపోయాను. ఆ పక్కనే ఉన్న చెప్పులు కుట్టే అబ్బాయిని వాకబు చేస్తే ఆ ఇల్లు కట్టించే యజమాని తండ్రి చనిపోయాడని, దాన్ని అరిష్టంగా భావించి అతను అర్థంతరంగా ఆపేసి అలాగే అమ్మకానికి పెట్టాడనీ చెప్పాడు. కూలీల విషయం మాత్రం తెలీదని చెప్పాడు.



నాకు నవనాడులూ కృంగి పోయాయి. భగవంతుడు ఒకే ఒక్క అవకాశం ఇచ్చాడు. నేను దాన్ని అందుకోలేక పోయాను. నా నిజాయితీని, నన్నూ ఎవరైనా పొగడగానే నా మనసు బాధగా మూలిగేది. నేనారోజున ఎందు కలా చేసానో నాకే అర్థం కాదు. ఈ పదిహేనేళ్లుగా నేనీ విషయాన్నసలు అంతర్గతంగా కూడా చర్చించుకోలేదు. ఏదో భయం, అపరాధ భావం నన్ను అడ్డుకొనేవి.

నాలో ఉన్న సామాన్య మానవుడిని నా అంతరాత్మ జయిస్తుందేమో, తాత్కాలికమైన ఆర్థిక ఇబ్బందుల కంటే తండ్రిగా మమతానురాగాలు ఎక్కువని ప్రబోధించి గెలుస్తుందని భయపడి ఆ రోజు తర్కానికి తావివ్వకుండా పారిపోయి బస్సెక్కేసానుకుంట. కానీ ఏదో ఒక వాదన నా వెనక



ఉండవచ్చు. మట్టిముద్దలా ఉన్న మా సారధితో కేవలం తన పనులు చేయించటమే ఒక విజయంలా మేము అనుకున్నాము. పైగా జీతాల్లేని భయంకర పరిస్థితుల్లో వాణ్ణి తెచ్చుకుని ఎలా నెట్టుకు రావటం? మేం ఆ సమయంలో వాడికి బొత్తిగా కొత్త వ్యక్తులం. మచ్చిక చేసుకుని, బ్రతిమాలి పోషించే ఆర్థిక, మానసికశక్తి కూడా లేని పరిస్థితులు.

ఆ కూలి మనిషి వాణ్ణి ప్రయోజకుణ్ణి చేసింది. వాడి పొట్ట వాడు పోసుకునే మార్గం చూపెడుతోంది. వాడి చేత పని చేయించి తిండి పెట్టి వాణ్ణొక మనిషిని చేసింది. మాలాగా వాణ్ణి వీపున మోసుకు తిరగకుండా వేలు పట్టుకు నడిపించింది. నేను వాణ్ణి తీసుకొస్తే తిరిగి మట్టిముద్దే అవుతాడు. మాస్టారు హోదాలో ఉన్న నేను వాడిచేత కూలి పని చేయించ లేను. వాణ్ణి పూర్తిగా పోషించనూ లేను. లేడనుకున్న సారధి మాకు లేనే లేడు. ఆ తల్లికి మనసులోనే నమస్కరించాను.

ఈ మధ్య తరగతి జీవితాలింతే. ఏ మాత్రపు కుదుపుని కూడా భరించ లేవు. కష్టాల్ని తీసుకున్నంత తేలిగ్గా మార్పులని ఆహ్వానించలేము. కొడుకు తప్పిపోతే ఆ బాధ భరించలేక ఆత్మహత్య చేసుకోబోయిన తండ్రిని. కానీ వాడు దొరికాక వాడిని తీసుకొస్తే కలిగే ఆటుపోట్లని, ఒడిదుడుకులని మాత్రం నేను భరించటానికి సిద్ధపడ లేదు. నాదీ ప్రేమేనా? నేనూ ఓ తండ్రి నేనా?

ఇదంతా జానకికి తెలిస్తే తట్టుకో లేదు. అలాగని వాణ్ణి తీసుకొచ్చే పరిస్థితులు లేవు. అందుకే నేను దోషిగానే మిగిలిపోదలుచుకుని జానకికి ఈ విషయం చెప్పలేక, అంతర్ముఖుడినై అంతరాత్మ అనే గుదిబండని నా కాళ్లకి తగిలించుకుని బరువుగా కదిలే కాలంలో అడుగులు కదుపుతున్నాను. నేను చేసింది. తప్పోఒప్పో నాకే తెలియటం లేదు. ఒక భగవంతుడి దృష్టిలో ఏమై ఉంటుందో మరి.

''లేవండి. నాలుగైంది. ఇక మెల్లిగా తెమలాలి. జనని కూడా త్వరగా వస్తానంది. అదేవిటి? ఆ కన్నీళ్లు – చిన్నపిల్లాడిలా రిటైరై పోతున్నందుకా. అంతేనండీ భావోద్వేగాలు అణచుకోవటం ఎవరితరం కాదు. ఎప్పుడూ గంభీరంగా ఉండే మీరిలా డీలా పడటం నేను చూడలేనండీ. లేవండి' అంటూ లేపింది జానకి.

అందుకు కాదు జానకీ అనబోయి ఆగిపోయాను. నా కళ్లు తడిసినందుకే చలించిపోయింది జానకి. నేను పడే నరకయాతన తెలిస్తే ఎంతో ఓదార్పు నిస్తుంది. కానీ ఆ విషయం తనకెలా చెప్పను?

అందుకే నా ఊహల్లో నేనొక ఒంటరి బాటసారిని. దరి, దాపు తెలియని ఇసుక ఎడారిలో కాళ్లు బొబ్బలెక్కే ఎండలో గమ్యం తెలియక నడుస్తూ సొక్కి, సోలిపోతున్న ఒంటరి బాటసారిని.

★

సెల్ : 94929 25366